**309 వ అధ్యాయం**

## ٣٠٩ - بَابُ النَّهْيِ عَنِ الْبُصَاقِ فِي الْمَسْجِدِ وَالأَمْرِ بِإِزَالَتِهِ مِنْهُ إِذَا وُجِدَ فِيهِ، وَالأَمْرِ بِتَنْزِيهِ الْمَسْجِدِ عَنِ الأَقْذَارِ

## మస్జిద్‌లో ఉమ్మి వేయరాదు. ఎక్కడైనా ఉమ్మిపడి ఉంటే దాన్ని తొలగించాలి. మాలిన్యాల నుంచి మస్జిద్‌ను పరిశుభ్రంగా ఉంచాలి

١٦٩٥ - عَنْ أَنَسٍ رَضِيَ اللهُ عَنْهُ أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «البُصَاقُ فِي الْمَسْجِدِ خَطِيئَةٌ، وَكَفَّارَتُهَا دَفْنُهَا». متفقٌ عليه.

والمُرَادُ بدَفْنِهَا إذا كَانَ المَسْجدُ تُرَاباً أَوْ رَمْلاً وَنَحْوَهُ، فيُوَارِيهَا تَحْتَ تُرَابِهِ. قالَ أَبُو المحاسنِ الرُّويَانِي مِنْ أَصْحَابِنَا في كِتَابِهِ «البحر» وقِيلَ: المُرَادُ بدَفْنِهَا إِخْرَاجُهَا مِنَ المَسْجِدِ، أَمَّا إذا كَانَ المَسْجدُ مُبَلَّطاً أَوْ مجصَّصاً، فَدَلَكَهَا عَلَيْهِ بمَدَاسِهِ أَوْ بغَيرِهِ كَمَا يَفعَلُهُ كثيرٌ مِنَ الجهَّالِ، فَلَيْسَ ذلكَ بدَفْنٍ، بَلْ زِيَادَةٌ في الخَطِيئةِ وَتَكْثِيرٌ للقَذَرِ في المَسْجِدِ، وَعَلَى مَنْ فَعَلَ ذلكَ أَنْ يَمْسَحَهُ بَعْدَ ذٰلكَ بثَوْبِهِ أَوْ بيَدِهِ أَوْ غيرِهِ أَوْ يَغسِلَهُ.

1695. హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఈ విధంగా ప్రవచించారు: మస్జిద్‌లో ఉమ్మి వేయటం పాపం. దాని పరిహారం దానిని మట్టితో పూడ్చేయటం.

(బుఖారీ-ముస్లిం)

పూడ్చేయటమంటే మస్జిద్ పచ్చిగా ఉన్న పక్షంలో, అంటే అక్కడ మట్టి లేక ఇసుక మొదలగునవి ఉన్నప్పుడు ఆ ఉమ్మి మీద మట్టిపోసి కనపడనీయకుండా చేయాలి. మా వాళ్ళలో (అంటే షాఫయీలలో) అబుల్ ముహాసిన్ రూయానీ తన గ్రంథం 'అల్ బహ్ర్'లో ఈ విషయం పేర్కొన్నారు. పూడ్చేయటమంటే దాన్ని మస్జిద్ నుండి బయటికి తీసి పారేయటమని మరికొందరు అభిప్రాయపడ్డారు. కాని మస్జిద్ రాళ్ళతో గాని లేక సున్నంతోగాని నిర్మించబడినదైతే చాలా మంది మూర్ఖులు చేసినట్టు ఉమ్మిని చెప్పు మొదలగు వాటితో

రుద్దేయటం పూడ్చేయటం క్రిందికి రాదు. పైగా ఇది మరింత పాపం, మస్జిద్‌లో మాలిన్యాన్ని పెంచటం క్రిందికి వస్తుంది. ఆ విధంగా చెప్పుతో రుద్దేవారు దాని తర్వాత తప్పకుండా దాన్ని గుడ్డతోగాని, చేత్తోగాని లేక మరే వస్తువుతో నయినాగాని తుడిచేయాలి (లేదా ఆ స్థలాన్ని కడిగేయాలి).

*(సహీహ్ బుఖారీలోని సలాత్ ప్రకరణం - సహీహ్ ముస్లింలోని మసాజిద్ ప్రకరణం)*

١٦٩٦ ـ وَعَنْ عَائِشَةَ رَضِيَ اللهُ عَنْهَا أَنَّ رَسُولَ اللهِ ﷺ رَأَى فِي جِدَارِ الْقِبْلَةِ مُخَاطاً، أَوْ بُزَاقاً، أَوْ نُخَامَةً، فَحَكَّهُ. متفقٌ عليه.

1696. హజ్రత్ ఆయిషా (రజి.అన్హా) కథనం: దైవప్రవక్త (సల్లం) మస్జిద్ ఖిబ్లా వైపు గోడ మీద చీముడు లేక ఉమ్మి లేక కళ్ళము ఉండటం చూసి దాన్ని గీకి శుభ్రం చేశారు. (బుఖారీ-ముస్లిం)

*(సహీహ్ బుఖారీలోని సలాత్ ప్రకరణం - సహీహ్ ముస్లింలోని మసాజిద్ ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

ఆ మాలిన్యం ఏదో ఉల్లేఖకునికి ఇతమిత్థంగా తెలియలేదు. ఏమయినప్పటికీ అది గోడమీద పడి ఎండి పోయింది. దైవప్రవక్త (సల్లం) దాన్ని చూసి తనే స్వయంగా దాన్ని శుభ్రం చేశారు. ఆ విధంగా తన అనుచర సమాజానికి శుచిశుభ్రతల గురించి క్రియాత్మకంగా నొక్కి చెప్పారు.

١٦٩٧ ـ وَعَنْ أَنَسٍ رَضِيَ اللهُ عَنْهُ أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ: «إِنَّ هذِهِ الْمَسَاجِدَ لَا تَصْلُحُ لِشَيْءٍ مِنْ هٰذَا الْبَوْلِ وَلَا الْقَذَرِ، إِنَّمَا هِيَ لِذِكْرِ اللهِ تَعَالَى، وَقِرَاءَةِ الْقُرْآنِ» أَوْ كَمَا قَالَ رَسُولُ اللهِ ﷺ. رواه مسلم.

1697. హజ్రత్ అనస్ (రజి) కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రబోధించారు: "మస్జిదుల్లో ఈ విధంగా మల మూత్ర విసర్జన చేయటం, మాలిన్యం పోయటం తగదు. ఇవి దైవ స్మరణ కోసం, ఖుర్ఆన్ పారాయణం కోసం ఉద్దేశించబడినవి."

లేక దైవప్రవక్త (సల్లం) ఇలాంటి మాటే
ఏదో అని ఉంటారు. (ముస్లిం)

*(సహీహ్ ముస్లింలోని తహారత్ ప్రకరణం)*

## ముఖ్యాంశాలు

1) ఓ పల్లెటూరి బైతు మస్జిదె నబవీలో మూత్రం పోసినప్పుడు దైవప్రవక్త (సల్లం) అతనితో అన్నమాటలివి. ఆ సమయంలో ఆయన ఎంతో ఓర్పుతో, నేర్పుతో అతనికి అలా చేయకూడదని బోధించారు. మస్జిదులు నిర్మించబడేది దైవస్మరణ, ప్రార్థనలు, ఖుర్ఆన్ పారాయణం మొదలగు ఆరాధనల కోసమేగాని ప్రాపంచిక పనులకోసం కాదని వివరించారు.

2) ఈ హదీసు చివర్లో, "లేక దైవప్రవక్త (సల్లం) ఇలాంటి మాటే ఏదో అని ఉంటారు" అని ఉంది. కొన్ని సందర్భాల్లో ఉల్లేఖకులు హదీసులు చెప్పినప్పుడు దైవప్రవక్త (సల్లం) మాటల్ని యథాతథంగా చెప్పలేకపోవచ్చు. అలాంటి సందర్భాల్లో ఉల్లేఖకులు జాగ్రత్తకోసం ఇలాంటి వాక్యాలు ఉపయోగిస్తారు. దైవప్రవక్త (సల్లం) మీద అబద్ధం ఆపాదించటం మహాపాపం. కనుక ఆ విధంగా పలికి ఉల్లేఖకులు ఈ మహాపాపం నుంచి తమల్ని తాము కాపాడుకుంటారు.